www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

శుక్రవారం
13.11.2026





వచ్చే జూన్ 2వ తేదీ నాటికి అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని చెప్పారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల నిర్మాణం, పరికరాల కొనుగోలు, సిబ్బంది నియామకాలు ఏకకాలంలో పూర్తి కావాలని స్పష్టం చేశారు.

కలంజ్యోతి, హైదరాబాద్

4 లో

జూన్ 2 నాటికి ఆసుపత్రులు సిద్ధం కావాలి

- నిమ్స్ విస్తరణ, సూపర్ స్పెషాలిటీ పనులు పూర్తి చేయాలి
- డిసెంబర్ నాటికి ఉస్మానియా సేవలు అందుబాటులోకి తేవాలి
- టిమ్స్‌ల పర్యవేక్షణకు గ్రూప్-1 అధికారులను నియమిస్తాం
- ఆసుపత్రుల్లో ఏఐ పర్యవేక్షణతో బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



- మంజూరు పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు
- మొత్తం 5.73 లక్షలకు చేరిన కొత్త లబ్ధిదారుల సంఖ్య

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19 నుంచి కొత్త లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా పింఛన్ డబ్బులు జమ కానున్నాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో మరో 4.5 లక్షల మంది అర్హులకు నూతనంగా చేయూత పింఛన్లను మంజూరు చేసిన ప్రభుత్వం, ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. తాజాగా మంజూరు చేసిన వాటితో కలిపి రాష్ట్రంలో మొత్తం కొత్త పింఛన్ లబ్ధిదారుల సంఖ్య 5,73,625కు చేరుకుంది.

-కలంజ్యోతి, హైదరాబాద్



2 లో..


లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ

19 నుంచి కొత్త పింఛన్లు

మహిళా కమిషన్ ఎదుట ప్రీతిరెడ్డి

- కమిషన్ లేవనెత్తిన సందేహాలకు వివరణ
- ప్రభుత్వ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తాం
- మల్లారెడ్డి విద్యాసంస్థల వైస్ చైర్మన్ ప్రీతిరెడ్డి


4 లో



బంగాళాఖాతంలో మరో తుఫాన్ ముప్పు

- దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షా లు కురిసే సూచన
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారుల హెచ్చరిక
- పంట నష్టం జరగకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

5 లో



మీరు విలేఖరి కావాలా?



సమాజంలో జరిగే విషయాలను ప్రజలకు చేరవేసే అవకాశం మీకోసం.
జిల్లా, పట్టణ, నియోజకవర్గ, మండల స్థాయిలో పని చేసే అవకాశం మీ కోసం సిద్ధంగా ఉంది..
ఆసక్తి, రాయాలనే తపన ఉంటే చాలు.
కొత్తవారికి కూడా అవకాశం...

వాట్సాప్ చేయండి 9494 009 003

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
శుక్రవారం 13.11.2026
www.kalamjyothi.com

19 నుంచి కొత్త పింఛన్లు



కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 13) : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19 నుంచి కొత్త లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా పింఛన్ డబ్బులు జమ కానున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నూతన లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో మరో 4.5 లక్షల మంది అర్హులకు కొత్తగా పింఛన్లను మంజూరు చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో మంజూరు పత్రాల పంపిణీ ప్రక్రియ కొనసాగనుంది.

మంజూరు పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు..

అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాలు, మున్సిపాలిటీల వారీగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై లబ్ధిదారులకు స్వయంగా ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్నారు. ఏళ్లుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలు, వితంతువులు, దివ్యాంగులు, వృద్ధుల చేతికి మంజూరు పత్రాలు అందడంతో వారి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ముఖ్యంగా ఈ కొత్త పింఛన్లలో మహిళలకు పెద్దపీట వేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖతో పాటు గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. దరఖాస్తుదారులకు ఏవైనా అభ్యంతరాలు లేదా సాంకేతిక సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించేందుకు వేదికల వద్ద ప్రత్యేక కౌంటర్లను కూడా అందుబాటులో ఉంచారు.

5.73 లక్షలకు చేరిన కొత్త లబ్ధిదారుల సంఖ్య..

మంజూరు పత్రాల పంపిణీ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈ నెల 19న నూతన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా పింఛన్ సొమ్మును జమ చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికే 1,23,625 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయగా, తాజాగా మంజూరు చేసిన 4.5 లక్షల పింఛన్లతో కలిపి మొత్తం కొత్త లబ్ధిదారుల సంఖ్య 5,73,625కు చేరుకుంది.



విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

చలికాలంలో ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

గిరిజన వసతి గృహాలను సందర్శించిన కలెక్టర్

కలంజ్యోతి, నెక్కొండ (నవంబర్ 12) : నెక్కొండలోని గిరిజన సంక్షేమ బాలుర, బాలికల కళాశాల వసతి గృహాలను గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆరోగ్య సంరక్షణ సేవలు, పౌష్టికాహారం నాణ్యత, వసతి సౌకర్యాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందిస్తున్న ఆహారం, ఇతర సౌకర్యాల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, వారికి నాణ్యమైన ఆహారం అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. వసతి గృహాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి..

అనంతరం విద్యార్థినులతో కలెక్టర్ ఆత్మీయంగా ముచ్చటించి వారి సమస్యలు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. చలికాలంలో ఆరోగ్య పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చలి నుంచి రక్షణ పొందేందుకు వెచ్చని దుస్తులు ధరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ కళాశాల వసతి గృహాల్లోని విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ 50 దుప్పట్లను (బ్లాంకెట్లు) పంపిణీ చేశారు. ఈ పర్యటనలో బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత రెడ్డి, డీటీడీఓ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతుల పేరిట రాజకీయం తగదు

కేటీఆర్‌పై నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ ఫైర్

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 12) : రైతుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తగదని ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ విమర్శించారు. ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం ముందుగానే రైతులను అప్రమత్తం చేసిందని తెలిపారు. సాగునీటి విషయంలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు లావణ్య



కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 12) : చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని లావణ్య అండర్ 17 పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. అక్టోబర్ 31న నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్న తెలిపారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో మేడ్చల్ జిల్లాలోని తూముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ లావణ్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయురాలు జయ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని లావణ్యతో పాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్నను ప్రధానోపాధ్యాయురాలు జయ, ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోష్‌కుమార్, పిన్నింటి బాలాజీరావు, మొగిలి, సుందర్, సతీష్ కుమార్, రామకృష్ణ, క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు ఇందిర, జూనియర్ అసిస్టెంట్ జాహెద్ అభినందించారు.



మృతుని కుటుంబానికి నాయకుల పరామర్శ

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 12) : చెన్నారావుపేట మండలం తిమ్మారాయినిపహాడ్ గ్రామ పంచాయతీకి చెందిన ఎద్దనపెల్లి అంతయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా అంతయ్య మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్‌బాద్ సహకార సంఘం చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ తమ్మేట రమేష్, సహకార సంఘం డైరెక్టర్ మంద యాకయ్య గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జయరాజ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బండి హరీష్, బాలజోజి, ఇన్నాచోరి, నిజాం, తోమాస్, ప్రతాప్, ఇన్నయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

శుక్రవారం 13.11.2026


www.kalamjyothi.com



వధూవరులకు నాయకుల ఆశీస్సులు

వివాహ రిసెప్షన్‌కు హాజరై శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 12) : చెన్నారావుపేట మండలం సూర్యాపేట తండాకు చెందిన మాజీ ఎంపీపీ దారావత్ అమ్మి, రఘు దంపతుల కుమారుడు రాజ్‌కుమార్ వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన రమేష్ పార్టీ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు రాజ్‌కుమార్, శ్రీ చామంతిలను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, సర్పంచులు కిషన్ నాయక్, దార రంజిత్, లావణ్య, హనుమా నాయక్, సంధ్య, మహేందర్, బాలు నాయక్, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, ఉప సర్పంచ్ చాపల మధుకర్, నాయకులు పెండ్లి రాజేందర్, కర్ణాకర్, రవి నాయక్, బద్రు నాయక్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు గోగుల ఆశీస్సులు

ఒడినింపే వేడుకలో చిన్నారులకు శుభాకాంక్షలు

కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 12) : నర్సంపేట పట్టణ బీజేపీ ఉపాధ్యక్షులు కొండగట్ల నాగరాజు, సౌమ్య దంపతుల కుమార్తెలు గీతమ శ్రీ, పూజశ్రీల ఒడినింపే వేడుక (సారె కార్యక్రమం) ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఆప్యాయంగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పసుపు, కుంకుమ అందజేసి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి, వేడుకలో పాల్గొన్న వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, నియోజకవర్గ నాయకులు జూలూరి మనీష్ గౌడ్, పార్లమెంట్ కోకన్వీనర్ కట్ల రాంచేందర్ రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు బానోత్ రమేష్, జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్రబాబు, తప్పెట్ల సతీష్, అనిల్, అజీమ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి సన్నిధానం ఏర్పాటు

హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా సన్నిధానం


కలంజ్యోతి, నర్సాపూర్ (నవంబర్ 13) : హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారులోని శ్రీరామ్ కాలనీ రామాలయంలో కులాలకు అతీతంగా హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా అయ్యప్ప స్వామి సన్నిధానం ఏర్పాటు చేసినట్లు ఆంజనేయులు గురుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్నూర మండలంలోని అన్ని గ్రామాల నుంచి దీక్ష స్వీకరించిన వారు ఈ సన్నిధానంలో ఉండేందుకు అవకాశం కల్పిస్తున్నామని, అయ్యప్ప మాల ధరించిన స్వాములకు ప్రతినిత్యం భిక్ష, అన్నదానం నిర్వహిస్తున్నామని అంజన్న స్వామి పేర్కొన్నారు. సన్నిధానంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ఆదర్శనీయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్య స్వాములు, గురు స్వాములు, గంట స్వాములు పాల్గొన్నారు.





బూత్ గెలిస్తేనే పార్టీ గెలుస్తుంది

- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి
- నాయకత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాల నిర్వహణ



కలంజ్యోతి, నర్సంపేట (నవంబర్ 12) : బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తేనే విజయం సాధ్యమవుతుందని, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నర్సంపేట పట్టణ భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యకర్తల కృషే పార్టీకి అసలైన బలమని, బూత్ గెలిస్తేనే పార్టీ గెలుస్తుందని అంకితభావంతో పనిచేయాలని కోరారు.

సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి..

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, ప్రతి ఇంటికీ చేరేలా చూడాలని ఆయన సూచించారు. అనంతరం పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా నాయకులు, తమ నాయకులు రాణా ప్రతాప్ రెడ్డి నాయకత్వ ఆదేశాల మేరకు నర్సంపేట పట్టణంలో పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు.

నాయకత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాల నిర్వహణ..

ఈ కార్యక్రమంలో 28వ వార్డు జూలూరి రోజా రాణి, నియోజకవర్గ నాయకులు జూలూరి మనీష్ గౌడ్, పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రాంచేందర్ రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు బానోత్ రమేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్ రెడ్డి, జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, పట్టణ జనరల్ సెక్రెటరీ సూత్రాల సరిత, ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్రబాబు, సీనియర్ నాయకులు గాదగోని అనిల్, బ్రహ్మాచారి, రవీంద్ర చారి, అనిల్, అజీమ్, వీరన్న, బద్రు, రాజు, తప్పెట్ల సతీష్, పట్టణ నాయకులు, మోర్చా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మీరేతెలంగాణకు దుష్టగ్రహాలు

కేటీఆర్ అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారు

బీజేఎల్పీనేత ఏలేటీ

కలంజ్యోతి, నిర్మల్ (నవంబర్ 12) : అధికారం కోల్పోయాక కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మల్‌లో నిర్వహించిన రైతు గర్జన సభలో కేటీఆర్ అబద్ధాలు మాట్లాడి రైతులను, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. వారి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వెలగబెట్టిందేమిటో ప్రజలకు తెలుసని, అందుకే వాళ్లను ఇంటికి పంపించారని అన్నారు. బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలను అష్ట గ్రహాలుగా అభివర్ణించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అష్ట గ్రహాలం కాదని, గత పదేళ్లుగా మీ కుటుంబ సభ్యులే తెలంగాణకు పట్టిన దుష్ట గ్రహాలని పేర్కొన్నారు.

మీ ప్రభుత్వ అవినీతిపై చర్చకు సిద్ధమా?

ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నిర్మల్‌లో వంద పడకల ఆసుపత్రితో పాటు రైల్వే లైన్‌కు అనుమతులు సాధించిన ఘనత తమదేనని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం పేరుతో లక్షల కోట్ల రూపాయలు దండుకున్న చరిత్ర మీది కాదా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన వాళ్లు ఫామ్ హౌస్‌కు పరిమితమైతే, తాము ప్రతిపక్ష పాత్రను పోషిస్తూ ప్రజల సమస్యలను అసెంబ్లీలో వినిపిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై ఆధారాలతో వస్తానని, అప్పుడు కేసీఆర్, కేటీఆర్‌లు చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. నిర్మల్‌లో క్రికెట్ కేర్ కేంద్రానికి రూ.23.74 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో ఇది ప్రారంభం కానుందని తెలిపారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం..

తమ హయాంలో రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టి ఇప్పుడు చిలుక పలుకులు పలుకుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటేనని, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై చర్య తీసుకుంటానని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి ఇప్పుడెందుకు నోరెత్తడం లేదని నిలదీశారు. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్ రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 13.11.2026
4
www.kalamjyothi.com

జూన్ 2 నాటికి ఆసుపత్రులు సిద్ధం కావాలి



కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 13) : వచ్చే జూన్ 2వ తేదీ నాటికి అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని చెప్పారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా నూతన ఆసుపత్రుల నిర్మాణ పనులు, ఆయా ఆసుపత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలు ఏకకాలంలో పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్సల కవరేజీని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు.

టిమ్స్ ల పర్యవేక్షణకు
గ్రూప్-1 అధికారులను నియమిస్తాం..

సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ఏకీకృత విధానంలో చేపట్టాలని ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా మూడు టిమ్స్‌ల మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సూచించారు. టిమ్స్‌ల పర్యవేక్షణకు గ్రూప్ 1 అధికారులను నియమిస్తామని తెలిపారు. నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామన్నారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలకు వేరే సిబ్బంది ఉంటే, వైద్యులు పూర్తిగా వైద్య సేవలపైనే దృష్టి సారించే అవకాశం ఉంటుందని అన్నారు. నిమ్స్‌లో శస్త్రచికిత్సలకు సమయం ఎక్కువ తీసుకుంటున్నందున సనత్‌నగర్ టిమ్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. నిమ్స్‌లో పడకలు లేకపోయినా, శస్త్రచికిత్సలకు ఆలస్యమైనా సనత్‌నగర్ టిమ్స్‌ను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలని సూచించారు. టిమ్స్‌లో వైద్యుల నియామకం పూర్తయ్యే వరకు బయటి నుంచి వైద్యులను నియమించుకోవాలని, అందుకు అవసరమయ్యే మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలి..

అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. నిర్మాణంలో ఉన్న మరో 79 డయాలసిస్ సెంటర్ల పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. టిమ్స్‌తో పాటు బోధన కళాశాలలు, నర్సింగ్ కళాశాలల పనులు, పరికరాల కొనుగోలు ప్రక్రియ ఏకకాలంలో పూర్తవ్వాలని, అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఏఐ పర్యవేక్షణతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరు విషయంలో బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ల (ఓపీ) సంఖ్య 7 కోట్ల నుంచి 9 కోట్లకు పెరగడం, ఇన్‌పేషెంట్ల (ఐపీ) సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరగడంపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మూడేళ్లలోనే వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేశామని తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేసే క్రమంలో వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

మహిళా కమిషన్ ఎదుట ప్రీతిరెడ్డి



కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 13) : మల్లారెడ్డి విద్యాసంస్థల వైస్ చైర్మన్, మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఎదుట హాజరయ్యారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో మహిళా కమిషన్ లేవనెత్తిన సందేహాలు, ప్రశ్నలకు వివరణ ఇచ్చేందుకు ఆమె కమిషన్ కార్యాలయానికి వచ్చి చైర్‌పర్సన్ నేరెళ్ల శారదతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కమిషన్ అడిగిన పలు అంశాలపై ఆమె సుదీర్ఘంగా సమాధానాలు ఇచ్చారు.

3 ఈవెంట్లు మాత్రమే నిర్వహించాం..

భేటీ అనంతరం ప్రీతిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ విద్యాసంస్థల వైస్ చైర్మన్ హోదాలో కమిషన్ అడిగిన అన్ని ప్రశ్నలకూ పూర్తిస్థాయిలో వివరణ ఇచ్చినట్లు తెలిపారు. కాలేజీలలో సినీ ఈవెంట్ల నిర్వహణపై వస్తున్న వార్తలపై స్పష్టతనిస్తూ 365 రోజుల్లో తమకు చెందిన మూడు వేర్వేరు క్యాంపస్‌లలో కేవలం మూడు ఈవెంట్లను మాత్రమే నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమాల వల్ల విద్యార్థుల రోజువారీ తరగతులకు ఎలాంటి భంగం కలగలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి జారీ చేసిన మార్గదర్శకాలను, ఆదేశాలను తమ విద్యాసంస్థలు తు.చ. తప్పకుండా పాటిస్తాయని వెల్లడించారు. కాలేజీల్లో వేడుకలు జరిగినప్పుడు యాజమాన్యంతో పాటు విద్యార్థులు కూడా తగినంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, విద్యార్థుల భద్రత, భవిష్యత్తుకు తమ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ అత్యధిక ప్రాధాన్యత ఇస్తాయని పేర్కొన్నారు.

పత్తికి నిప్పు పెట్టిన దుండగులు

రూ.50 వేల మేర ఆస్తి నష్టం

కలంజ్యోతి, చెన్నారావుపేట (నవంబర్ 12) : గుర్తుతెలియని వ్యక్తులు నిల్వ ఉంచిన పత్తికి నిప్పు పెట్టడంతో ఓ రైతు కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లిన ఘటన చెన్నారావుపేట మండలం పాత మగ్ధుంపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సుంకరి ఎల్లస్వామి ఇంటి అరుగుపై నిల్వ ఉంచిన పత్తికి బుధవారం రాత్రి 11:30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనలో పత్తి పూర్తిగా దగ్ధం కావడంతో సుమారు రూ.50 వేల మేర ఆస్తి నష్టం జరిగినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి పండించిన పంట కళ్ల ముందే అగ్నికి ఆహుతి కావడంతో ఆ కుటుంబం తీవ్ర మనోవేదనకు గురైంది.





బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలి..

విషయం తెలుసుకున్న గ్రామ ఉపసర్పంచ్ అలవాల శ్రీనివాస్, వార్డు సభ్యుడు జన్ను రమేష్ బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి కాలిపోవడంతో నష్టపోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు గ్రామానికి వచ్చి జరిగిన నష్టాన్ని పరిశీలించి, బాధిత రైతుకు తగిన నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

ఇరిగేషన్ డీఈ ఇంట
ఏసీబీ సోదాలు

10 ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో ఉక్కుపాదం
50 తులాల బంగారం, 25 ఎకరాల భూమి గుర్తింపు



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (నవంబర్ 13) : నాగర్‌కర్నూల్ జిల్లా ఇరిగేషన్ అండ్ సీఏడీ శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆర్. రాగిరి సత్యనారాయణ గౌడ్ లక్ష్యంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఉక్కుపాదం మోపారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో గురువారం 10 ప్రత్యేక ఏసీబీ బృందాలు ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని డీఈ కార్యాలయంతో పాటు హైదరాబాద్‌లోని బైరామల్‌గూడ నివాసం, ఇతర ప్రాంతాల్లో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, ల్యాప్‌టాప్, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

50 తులాల బంగారం, 25 ఎకరాల భూమి గుర్తింపు..

ఈ సోదాల్లో సత్యనారాయణ గౌడ్‌కు సంబంధించిన భారీ స్థిర, చరాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. తనిఖీల్లో 50 తులాల బంగారం, తుక్కుగూడలో ఒక విల్లా, 25 ఎకరాల వ్యవసాయ భూమి, రెండు ప్లాట్లు, ఐదు ఓపెన్ ప్లాట్లు, మూడు కార్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. గుర్తించిన ఈ ఆస్తుల అధికారిక విలువ సుమారు రూ.6 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. సోదాలు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
శుక్రవారం 13.11.2026
www.kalamjyothi.com

జియో తరహాలోనే గ్రీన్ ఎస్ఎమ్ వ్యూహం

- స్థానిక డ్రైవర్ల పొట్ట కొట్టాలని చూస్తోంది
- ఆరు లక్షల మంది డ్రైవర్ల ఉపాధికి ప్రమాదం
- ప్రభుత్వం ఏమీ పట్టనట్లు చోద్యం చూస్తోంది
- బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్




కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 13) : గతంలో టెలికాం రంగంలో జియో అనుసరించిన వ్యాపార వ్యూహాన్నే హైదరాబాద్‌లో కొత్తగా కార్యకలాపాలు ప్రారంభించిన గ్రీన్ ఎస్ఎమ్ ఎలక్ట్రిక్ క్యాబ్ సంస్థ అనుసరిస్తోందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక కంపెనీ తన వ్యాపార విస్తరణ కోసం స్థానిక ఆటో, క్యాబ్ డ్రైవర్ల పొట్ట కొట్టాలని చూస్తోందని మండిపడ్డారు. 2016లో జియో సంస్థ ఉచిత డేటా, ఉచిత కాల్స్ ఆఫర్‌తో వచ్చి ఎయిర్‌సెల్, టాటా డొకోమో, రిలయన్స్ టెలికమ్యూనికేషన్స్ వంటి కంపెనీలను కనుమరుగు చేసిందని, వొడాఫోన్, ఐడియా సంస్థలు కలిసిపోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. పోటీదారులంతా లేకుండా పోయాక జియో రేట్లు పెంచడం మొదలుపెట్టిందని, ఇప్పుడు గ్రీన్ ఎస్ఎమ్ కంపెనీ కూడా సరిగ్గా అదే చేయబోతోందని పేర్కొన్నారు.

ఆరు లక్షల మంది డ్రైవర్ల ఉపాధికి ప్రమాదం

ప్రస్తుతం కిలోమీటరుకు రూ.8 అంటూ తక్కువ ధరలతో కస్టమర్లను ఆకర్షిస్తున్నారని ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లంతా తమ వాహనాలు బంద్ చేసుకుని, ర్యాపిడోలు ఆపేసి తమ వద్దకు వచ్చి జీతానికి డ్రైవర్లుగా చేరాలని గ్రీన్ ఎస్ఎమ్ పరోక్షంగా చెబుతోందని విమర్శించారు. ఈ పరిణామాల వల్ల రాష్ట్రంలోని సుమారు ఆరు లక్షల మంది డ్రైవర్ల జీవనోపాధి ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏమీ పట్టనట్లు చోద్యం చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు.

బంగాళాఖాతంలో మరో తుఫాన్ ముప్పు

బంగాళాఖాతంలో మరోసారి వాతావరణ మార్పులు వేగంగా చోటుచేసుకుంటున్నాయి. దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విశాఖపట్నం తుఫాన్ హెచ్చరికల కేంద్రం స్పష్టం చేసింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఏర్పడనున్న ఈ అల్పపీడనం క్రమంగా పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. దీని ప్రభావంతో రాబోయే మూడు నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 13) : బంగాళాఖాతంలో మరోసారి వాతావరణ మార్పులు వేగంగా చోటుచేసుకుంటున్నాయి. దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విశాఖపట్నం తుఫాన్ హెచ్చరికల కేంద్రం స్పష్టం చేసింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఏర్పడనున్న ఈ అల్పపీడనం క్రమంగా పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. రానున్న 24 గంటల తర్వాత సముద్రంలో గాలుల వేగం పెరిగి, అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షా లు కురిసే సూచన..

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ వాయుగుండం మరింత బలపడి తుఫాన్‌గా రూపాంతరం చెందే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ వాతావరణ నమూనాలు సూచిస్తున్నాయి. తుఫాన్‌గా మారిన తర్వాత ఇది తన దిశను మార్చుకుని ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. దీని ప్రభావంతో రాబోయే మూడు నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారుల హెచ్చరిక..

సముద్రం అల్లకల్లోలంగా మారనున్న నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారు తక్షణమే తీరానికి చేరుకోవాలని సూచించారు. మరోవైపు వరి కోతల సమయం కావడంతో అకాల వర్షాల హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పంట నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. అల్పపీడనం కదలికలను, తుఫాన్ తీవ్రతను వాతావరణ కేంద్రం నిరంతరం పర్యవేక్షిస్తోంది. రాబోయే 48 గంటల్లో దీని గమనంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తీర ప్రాంత ప్రజలు, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.

రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్‌ల బదిలీ

- హైదరాబాద్ సీపీగా మహేష్ భగవత్
- ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్ బదిలీ
- శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ స్థాయిలో 21 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారికంగా ఉత్తర్వులు (జీవో ఆర్‌టీ నెం. 1654) జారీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా హైదరాబాద్ నూతన సీపీగా మహేష్ మురళీధర్ భగవత్ నియమితులు కాగా, ఇప్పటివరకు సీపీగా ఉన్న వీసీ సజ్జనార్‌ను ఫైర్ సర్వీసెస్ డీజీగా బదిలీ చేశారు. రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్ కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.

కలంజ్యోతి, హైదరాబాద్ (నవంబర్ 13) : తెలంగాణ పోలీస్ శాఖలో భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 21 మంది సీనియర్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారికంగా ఉత్తర్వులు (జీవో ఆర్‌టీ నెం. 1654) జారీ చేశారు. లా అండ్ ఆర్డర్, ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్ విభాగాల్లో సమూల మార్పులు చేస్తూ పోస్టింగ్‌లు కేటాయించారు. ఈ బదిలీల్లో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్త సారథి వచ్చారు. ఇప్పటివరకు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న మహేష్ మురళీధర్ భగవత్‌ను హైదరాబాద్ సీపీగా ప్రభుత్వం నియమించింది.

ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్ బదిలీ..

ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా (డీజీ) బదిలీ చేశారు. ఆయనకు అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) డీజీ బాధ్యతలను కూడా అప్పగించారు. అలాగే రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్ నియమితులయ్యారు. ఆయనకు కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల బాధ్యతలను కూడా ప్రభుత్వం కేటాయించింది.

శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్..

బదిలీ అయిన 21 మంది ఐపీఎస్ అధికారులు, వారి కొత్త బాధ్యతల వివరాలు ఇలా ఉన్నాయి. 1. మహేష్ మురళీధర్ భగవత్ (1995 బ్యాచ్): హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్, 2. వీసీ సజ్జనార్: డీజీ (తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్), ఎస్‌పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు, 3. డాక్టర్ సౌమ్య మిశ్రా (1994 బ్యాచ్): డీజీపీ (మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా), ఏడీజీపీ (ఆర్గనైజేషన్ అండ్ లీగల్)గా అదనపు బాధ్యతలు, 4. స్వాతి లక్రా (1995 బ్యాచ్): జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్, హోంగార్డ్స్ డీజీపీగా అదనపు బాధ్యతలు, 5. చారు సిన్హా (1996 బ్యాచ్): ఏసీబీ డైరెక్టర్ జనరల్, సీఐడీ డీజీపీగా అదనపు బాధ్యతలు, 6. డాక్టర్ అనిల్ కుమార్ (1996 బ్యాచ్): టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్,




7. వై. నాగిరెడ్డి (1997 బ్యాచ్): పౌరసరఫరాల శాఖ కమిషనర్ అండ్ ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ (లీగల్ మెట్రాలజీ అదనపు బాధ్యతలు), 8. విక్రమ్ సింగ్ మాన్ (1998 బ్యాచ్): గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ డీజీపీ (ఆపరేషన్స్), పోలీస్ హౌసింగ్ విభాగం, 9. ఎం. స్టీఫెన్ రవీంద్ర (1999 బ్యాచ్): టీజీటీఎంఏఆర్ఎస్ డైరెక్టర్, 10. అకున్ సబర్వాల్ (2001 బ్యాచ్): అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్), కోఆర్డినేషన్ అండ్ టెక్నికల్ సర్వీసెస్, 11. సంజయ్ కుమార్ జైన్: అదనపు డీజీపీ (ట్రైనింగ్ అదనపు బాధ్యతలు), 12. ఎస్. చంద్రశేఖర్ రెడ్డి (2004 బ్యాచ్): డైరెక్టర్, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), 13. కార్తికేయ (2006 బ్యాచ్): ఐజీ (మల్టీ జోన్ 1), ఐసీసీసీ డైరెక్టర్, 14. కె. రమేష్ నాయుడు (2006 బ్యాచ్): రైల్వేస్ ఐజీ, 15. డి. జోయల్ డేవిస్ (2010 బ్యాచ్): టీజీటీఎంఏఆర్ఎస్ రోడ్ సేఫ్టీ అండ్ ట్రాఫిక్ జాయింట్ డైరెక్టర్, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా అదనపు బాధ్యతలు, 16. జి. చందన దీప్తి (2012 బ్యాచ్): జోన్ 7 (జోగులాంబ గద్వాల) డీఐజీగా అదనపు బాధ్యతలు, 17. ఆర్. భాస్కరన్ (2012 బ్యాచ్): డీఐజీ (ఇంటెలిజెన్స్), 18. కె. నారాయణ నాయక్ (2009 బ్యాచ్): జోన్ 2 (బాసర) డీఐజీగా అదనపు బాధ్యతలు, 19. ఎల్.ఎస్. చౌహాన్ (2009 బ్యాచ్): డీఐజీ (కోఆర్డినేషన్), జోన్ 6 డీఐజీగా అదనపు బాధ్యతలు, 20. శ్రీబాలా దేవి: టీజీటీఎంఏఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్), 21. వి. అరవింద బాబు: హైదరాబాద్ సిటీ డీసీపీ (ఎస్ఎం అండ్ ఐటీ)గా నియమితులయ్యారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

నా మొదటి తెలుగు సినిమాతో

ఆనందం

తెలుగులో తన మొదటి సినిమా గోట్ విడుదల కావడం పట్ల హీరోయిన్ దివ్యభారతి ఆనందం వ్యక్తం చేశారు. జబర్దస్త్ ఫేమ్ సుడిగాలి సుధీర్ హీరోగా నటించిన ఈ చిత్రం నవంబర్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వేదవ్యాస్ దర్శకత్వంలో మహాతేజ క్రియేషన్స్, జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాను ఏషియన్ సినిమాస్ సమర్పించింది. థియేటర్లో ప్రేక్షకులతో కలిసి సినిమా చూసిన దివ్యభారతి తన అనుభూతిని సోషల్ మీడియాలో పంచుకున్నారు. తన మొదటి తెలుగు సినిమాను ప్రేక్షకుల మధ్య ఫస్ట్ డే, ఫస్ట్ షో చూడటం ప్రత్యేక అనుభవమని, వారి నుంచి లభిస్తున్న ప్రేమ అద్భుతమని పేర్కొన్నారు. గోట్ చిత్రం వెనుక ఎంతో మంది కఠిన శ్రమ ఉందని, ప్రతి ఒక్కరూ థియేటర్లలో ఈ సినిమాను చూసి తమ బృందానికి మద్దతు అందించాలని కోరుతూ ఆమె వీడియో షేర్ చేశారు.



Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.